క్లుప్తంగా

రైతు సంక్షేమమే లక్ష్యం



మాచర సహకార సంఘం కార్యాలయంలో చర్చిస్తున్న చంటిబాబు, సభ్యులు

కపిలేశ్వరపురం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు మాచర పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల చంటిబాబు అన్నారు. మాచర సహకార సంఘ కార్యాలయంలో గురువారం సంఘం మహాజన సభ ఆయన అధ్యక్షతన జరిగింది. రైతు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, జమా ఖర్చులపై చర్చించారు. చంటిబాబు మాట్లాడుతూ సంఘం రూ.2.25 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుందన్నారు. 2022 అక్టోబర్ నుంచి 2023 ఫిబ్రవరి వరకూ జమా ఖర్చులను సహకార సంఘం అధికారులు వెల్లడించారు. సమావేశంలో సంఘ సభ్యులు కరెడ్ల వెంకట గున్నేశ్వరరావు, మట్టపర్తి హరినాథ్, అడపా రామకృష్ణారావు, మద్దూరి సత్యనారాయణ, బడుగు నల్లబాబు, యర్రంశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 195 మంది హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 195 మంది విద్యార్థులు హాజరయ్యారు. గణితం–1బీ పరీక్షకు 105, జువాలజీ పరీక్షకు 80, హిస్టరీ పరీక్షకు 10 మంది హాజరయ్యారు. మొత్తం 206 మంది విద్యార్థులకు గాను 11 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీర వెంకటనాగేశ్వరరెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే శుక్రవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు గణితం–2బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

కరుణామయ యూత్ సాయం



మహిళకు సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

మండపేట: కేశవరానికి చెందిన కరుణామయ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పలివెల చిన్నారికి 25 కిలోల బియ్యం, రూ.3 వేల నగదు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పోసుపో అశోక్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో దేదీప్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అవ్వారు శివాజీ చేతుల మీదుగా ఈ సాయం అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు మందపల్లి పోలా ప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో కూలిపని చేసుకునే కొందరు యువకులు సంస్థగా ఏర్పడి చేతనైనంతలో ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శెట్టి శ్రీను, చంద్రమళ్ల సుధీర్, దొండపాటి దయానంద్, సమతం చినపాపారావు, రాజేష్, చంద్రహాస్, శెట్టి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులను వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామన ప్రభాకరరావు

మండపేట: ప్రజల కోసం కేసులు ఎదుర్కోవడం, జైళ్లకు వెళ్లడం రాహుల్‌గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ అవినీతి అక్రమాలను రాహుల్‌గాంధీ ఎదురిస్తున్నారనే అక్కసుతో పాత కేసును తిరగదోడి రెండేళ్ల జైలుశిక్ష పడేలా జడ్జిమెంట్ ఇప్పించారని ఆరోపించారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు రాహుల్‌గాంధీ భయపడరన్నారు. తక్షణం తప్పుడు కేసులను బీజేపీ నాయకులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కొడవళ్ల సుబ్బారావు, కొండా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

సీతానగరం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఇందిరా భారతి ఆధ్వర్యంలో గురువారం బొబ్బిల్లంక అంగన్‌వాడీ కేంద్రం–2లో పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిల్లంకలోని ఐదు అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన గర్భిణులు, బాలింతలను చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఇందిరా భారతి మాట్లాడుతూ చిరుధాన్యాలు వాడటం ఆరోగ్యానికి చాలామంచిదన్నారు. మినుములతో తయారు చేసిన ఆవడ, మినపరొట్టె, సున్నుండలు, గుమ్మడి వడియాలు, బూరెలు, గారెలు, కారం పొడి, బెల్లం గారెలు వంటి పలు వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వి.రాధారాణి, జె.గంగాభవానీ, ఎన్.పద్మ, బి.మణి, ఎల్.సరోజ, ఏఎన్ఎం దేవి పాల్గొన్నారు.

ఇంతింతై.. ఆకాశమంతై..

- అతివలకు ఆర్థిక 'ఆసరా'
- ప్రభుత్వ తోడ్పాటుతో ముందంజ
- రేపు 71,569 మందికి రూ.60.98 కోట్ల జమ



రాయవరం: 'ఇంతి'ంతై ఆకాశమంతై ఎదుగుతున్నారు.. అన్నింటా మేము సైతం అంటూ ముందుకు సాగుతున్నారు.. అతివలకు పథకాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యం కొండంత 'ఆసరా'గా మారింది.. మూడేళ్లుగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. తద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో పేద మహిళల ఆర్థిక పురోగతికి మార్గం సుగమమైంది. మహిళాభ్యుదయమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రతి పథకంలోనూ అతివలను భాగస్వాములను చేస్తున్నారు. రుణమాఫీ కింద వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటికే రెండు విడతల సొమ్ము జమ చేసిన ప్రభుత్వం తాజాగా మూడో విడత నిధులను ఈ నెల 25న విడుదల చేస్తుంది. 2019 ఏప్రిల్ 11 నాటికి బ్యాంకు లింకేజీ ద్వారా పొందిన రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం వైఎస్సార్ ఆసరా క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల రుణమాఫీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఆసరా సంబరాలను అధికారులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళా సంఘాల్లోని సభ్యులకు బొట్టుపెట్టి సంఘానికి ఎంత మొత్తం వచ్చిందన్న విషయాన్ని.. వ్యక్తిగతంగా ఎంత మేర లబ్ధి కలిగిందనే విషయాలు తెలియజేయనున్నారు. అక్కడే డిజిటల్ రసీదులు సైతం అందజేయనున్నారు. దీంతో ప్రతి మహిళకూ తనకు కలిగిన లబ్ధి గురించి తెలుసుకునే వీలుంటుంది.

క్లస్టర్ పరిధిలో ఇలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 7,412 మహిళా శక్తి సంఘాల పరిధిలో 71,569 మంది సభ్యులు వైఎస్సార్ ఆసరా పథకంలో లబ్ధి పొందారు. వీరందరికి మూడు విడతల్లో రూ.183.05 కోట్ల మేర మేలు చేకూరింది. మొదటి విడతలో 7,340 సంఘాల పరిధిలోని 71,569 మంది మహిళలకు రూ.60.53 కోట్లు అందించారు. రెండో విడతలో 7,412 ఎస్‌హెచ్‌జీల పరిధిలోని 71,569 మంది డ్వాక్రా మహిళలకు రూ. 61.54 కోట్ల మేర లబ్ధి జరిగింది. మూడో విడతలో 7,412 మహిళా శక్తి సంఘాల పరిధిలోని 71,569 మంది సంఘ సభ్యులకు రూ.60.98 కోట్ల మేర లబ్ధి పొందనున్నారు.

బయోమెట్రిక్‌తో అందరికీ న్యాయం

వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత లబ్ధిదారులకు ప్రభుత్వం బయోమెట్రిక్ తప్పనిసరి చేసింది. రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అధిక మొత్తంలో లబ్ధి పొందుతున్నారు. దానిని అరికట్టి అందరికీ మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో మహిళా సంఘాల సభ్యుల బయోమెట్రిక్ చేయిస్తోంది. దీనివల్ల అర్హులందరికీ న్యాయం జరుగుతుంది.

మూడో విడత వైఎస్సార్ ఆసరా ఇలా..

మండలం	ఎస్‌హెచ్‌జీలు	సభ్యులు	విడుదలైన సొమ్ము (రూ.కోట్లలో)
కపిలేశ్వరపురం	1,504	14,176	రూ.11.94
మండపేట	1,580	15,479	రూ.11.87
రాయవరం	1,479	14,282	రూ.13.70
కె.గంగవరం	1,347	12,597	రూ.10.94
రామచంద్రపురం	1,501	15,025	రూ.12.53

ఇచ్చిన మాట ప్రకారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల వైఎస్సార్ ఆసరా పథకం సొమ్ము మహిళలు ఆర్థికంగా బలపడేందుకు దోహదపడింది. మూడో విడత కూడా విడుదల చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళాభ్యుదయానికి ప్రభుత్వం చేస్తున్న కృషి మరువరానిది.

–కర్రి సుజాత, అధ్యక్షురాలు, మండల మహిళా సమాఖ్య, రాయవరం

ఆర్థికంగా పురోగమించేందుకు..



మహిళలు ఆర్థికంగా పురోగమించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కిరాణా షాపును నిర్వహించుకుంటున్నాను. రెండు విడతల్లో సొమ్మును ప్రభుత్వం సక్రమంగా విడుదల చేసింది. మూడో విడతను కూడా విడుదల చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలుపుకొన్నారు.

–ఎం.నాగదుర్గాదేవి, మారేడుబాక, మండపేట మండలం

బీమా సొమ్ము అందజేత

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామానికి చెందిన పాము సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గురువారం సర్పంచ్ నానాపరపు కళ్యాణి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయంగా రూ.10 వేలు వారి కుటుంబానికి అందించారు. ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి

కాజులూరు: రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. గురువారం మండలంలోని తణుకువాడలో మండల వ్యవసాయాధికారి(ఏవో) వి.అశోక్ అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్, పంటల బీమా, ఈ పంట నమోదు, వైఎస్సార్ పొలంబడి, వ్యవసాయ యాంత్రీకరణ (సీహెచ్‌సీ) తదితర పథకాల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుత దశలో పంటపై సోకే పలు రకాల తెగుళ్లు వాటి నివారణపై రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, గ్రామ మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, వాసంశెట్టి శ్రీనివాస్ వీఏఏలు అనూష, శిరీష, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంతో మార్పునకు నాంది



వెల్లలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రామచంద్రపురం రూరల్: ప్రజా ఆరోగ్య పరిరక్షణలో జగనన్న స్వచ్ఛ సంకల్పం మార్పుకి నాంది కావాలని రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని అన్నారు. మండలంలోని వెల్ల గ్రామంలో గురువారం చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ భవాని పాల్గొన్నారు. తాడేపల్లిలో స్వచ్ఛ సంకల్పం ప్రత్యేక శిక్షణ పొందిన డీపీఆర్‌సీ లావణ్య, ఈఓపీఆర్డీ ఎన్.షెలత్‌రాజు, వెల్ల పంచాయతీ కార్యదర్శులు రాయుడు మోహన్, ఎండీ స్వెత్లానాలు రామచంద్రపురం మండలం ఆదివారపుపేట, కాపవరం, మండపేట మండలం వై.సీతానగరం, మేర్నిపాడు, కె.గంగవరం మండలం గంగవరం, దంగేరు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ అందజేశారు. దీనిలో భాగంగా చెత్త సేకరణ రిక్షాలతో ప్రజా ప్రతినిధులు, అధికారులు పారిశుద్ధ్య కార్మికుల యూనిఫామ్‌లు ధరించి గ్రామంలో ఇంటింటికీ పర్యటించి గ్రామస్తులకు తడిచెత్త, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయడం, రోడ్లపై చెత్త వేయకుండా ఉండటం, పశువులను పెంచుకునే రైతులతో చెత్త సంపద కేంద్రానికి పేడ ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఎన్.కీర్తి స్పందన, ఎన్.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్నం సతీష్, బళ్ల సుధాకరరావు, సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, నక్కిన దొరబాబు, యనమదల మంగాదేవి, కోటి లక్ష్మీ నరసమ్మ, కొప్పిశెట్టి వెంకటరమణ, జి.సౌజన్య, వి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గోగులాంబ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



గోగులాంబ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న గోగులాంబ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, గ్రామ ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, నాయకులు దామిశెట్టి గంగా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘానికి రూ.11.97 లక్షల లాభం



మహాజన సభలో మాట్లాడుతున్న జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రాజు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద చేనేత సహకార సంఘం 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు రూ.11.87 లక్షలు నికర లాభం సంపాదించినట్లు సొసైటీ చైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాశ్ తెలిపారు. సంపాదించిన లాభం సంఘ సభ్యులకు బోనస్, డెవిడెండ్లుగా పంపిణీ చేయడానికి గురువారం మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివంగత దొంతంశెట్టి విరూపాక్షం ప్రారంభించిన హసన్‌బాద చేనేత సహకార సంఘం గడచిన 42 సంవత్సరాలుగా లాభాలను సంపాదిస్తూ సహకార రంగంలోనే అరుదైన ఘనతను సాధించిందన్నారు. అంతే కాకుండా రూ.1.88 కోట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేసి సంఘ సభ్యులకు వృద్ధాప్య పింఛన్, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మరణించినప్పుడు అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రాజు మాట్లాడుతూ సంఘం పనితీరును అభినందించారు. మార్కెట్‌కు అనుగుణంగా నూతన డిజైన్లు తయారు చేయాలని సూచించారు. బోనస్, డెవిడెండ్ల పంపిణీపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాదాత 'దొమ్మేటి' చిరస్మరణీయుడు



వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నరేన్ తదితరులు

రామచంద్రపురం: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త, విద్యాదాత దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి నరేన్, శెట్టిబలిజ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపం వద్ద తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు నేతృత్వంతో వెంకటరెడ్డి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కె.గంగవరం మండల విప్ కొప్పిశెట్టి లక్ష్మణరావు, కౌన్సిలర్‌లు కేతా శ్రీను పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజ సంఘం నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, మేడిశెట్టి ఇస్రాయేల్, గెద్దాడ శ్రీరామ్, బీజేపీ నాయకులు కాదా వీర వెంకటరమణ తదితరులు కేక్ కటింగ్ చేసి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘానికి వెంకటరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

మండపేట: మండపేట శెట్టిబలిజ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో విద్యాదాత దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు గురువారం జరిగాయి. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి పట్టణ సంఘ అధ్యక్షుడు పెంకే గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు పగలు, రాత్రి పాఠశాలల వద్దే భోజన వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేసిన విద్యాదాత వెంకటరెడ్డిని కొనియాడారు. మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, సూరంపూడి సత్యప్రసాద్, పెంకే వెంకట్రావు, పంపన శ్రీనివాస్, కోట వీరవెంకట నరసింహారావు, యాండ్ర ప్రభాకరరావు, చొల్లంగి రాజశేఖర్ పాల్గొన్నారు.

కాజులూరు: శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను బీసీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యవిభాగ నేత, కాకినాడ వైఎస్సార్ జగనన్న హాస్పిటల్, రమ్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పితాని అన్నవరం అన్నారు. కాజులూరు మండల గ్రామాల్లో శెట్టిబలిజ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. దుగ్గుదుర్రులో వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో డాక్టర్ పి.అన్నవరం పాల్గొని శెట్టిబలిజ సామాజిక వర్గంలోని పలువురు సీనియర్ నాయకులు, మహిళలను సత్కరించారు. అలాగే రామచంద్రపురం టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు పాల్గొన్నారు.



మండపేటలో వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: శెట్టిబలిజల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి విశేష కృషి చేశారని వక్తలు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దొమ్మేటి జయంతిని కపిలేశ్వరపురానికి చెందిన శెట్టిబలిజ సంఘం నాయకులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కాదా వెంకటరాంబాబు, నాయకులు కట్టా మురళీ, కొప్పిశెట్టి శ్రీనివాస్, జుత్తక మల్లిఖార్జునుడు, గుత్తుల శివ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శం



రామచంద్రపురంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

రామచంద్రపురం: దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అంకితం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, పలువురు నేతలు సూచించారు. పట్టణంలోని బ్రాడీపేటలో అబ్దుల్ కలాం సేవాదళ్ నేతృత్వంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు గొర్రెల రాము మాట్లాడుతూ 92 సంవత్సరాల తర్వాత కూడా భగత్‌సింగ్‌ను తలచుకుంటున్నామంటే ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎటువంటిదో మనం తెలుసుకోవాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు కోల్‌కతాలోని బ్రిటిష్ పరిపాలన భవనంపై బాంబు విసిరి సంచలనం సృష్టించారన్నారు. ఈ కేసులు ముగ్గురిని బ్రిటీష్ ప్రభుత్వం నిందితులుగా గుర్తించి ఉరి తీసిందన్నారు. శిక్షను అమలు జరిపే క్రమంలో ఉరికంభం ఎక్కుతూ నా బలిదానం స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక ఊపు ఇచ్చి దేశంలో ఉన్న యువకులు స్వాతంత్ర్య ఉద్యమం గురించి ఆలోచించగలిగితే నా జీవితానికి అర్థం ఉంటుందని భగత్‌సింగ్ అన్నారన్నారు. మనమందరం స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను దానిలో భగత్‌సింగ్ పాత్రను చదువుకుని దేశప్రగతికి ఉపయోగపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షుడు మహ్మద్ బాబ్జి, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎం.ప్రేమానందం, సీపీఐ కార్యదర్శి పి.రాము, కార్యకర్తలు, కె.చంద్రరావు, వి.కృష్ణమూర్తి, ఆర్ గోవిందు, ఎం.సత్యభద్రరాజు, ఎ.అప్పారావు, ఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: విప్లవ అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి పురస్కరించుకుని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ద్రాక్షారామ శ్రీనివాసశైల ఐటీఐ ప్రాంగణంలో జరిగిన సభలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంటేశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం విప్లవ పంథాలో పోరాడి ఉరికొయ్యల పాలైన వారి సేవలు అజరామరం అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, పీవైఎల్ డివిజన్ నాయకులు తాతపూడి చిన్నయ్య, కాశి, లెనిన్‌బాబు, రామదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో విప్లవవీరుల సంతాప సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

అగ్ని ప్రమాదంలో దాబా దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన దాబా

మండపేట: స్థానిక బైపాస్ రోడ్డులో గురువారం ఓ దాబా రెస్టారెంట్ కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 60 వేల ఆస్తి నష్టం వాటిల్లగా అదృష్టవశాత్తు ఎవరికి ఏమీ కాలేదు. బైపాస్ రోడ్డులోని పి.సత్యదేవ్‌కు చెందిన స్థలంలో ఒడిశాకు చెందిన కొందరు హనుమాన్ దాబా నిర్వహిస్తున్నారు. ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. షెడ్డు పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మండపేట అగ్నిమాపక శాఖ అధికారి హనుమంతరావు సిబ్బందితో కలసి మంటలను అదుపు చేశారు.

రేపు 'నన్నయ'లో మేనేజ్‌మెంట్ ఫెస్ట్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'సవిస్కార్ 2 కె 23' పేరిట మేనేజ్‌మెంట్ ఫెస్ట్ జరగనుంది. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు గురువారం విడుదల చేశారు. విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్ వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, డాక్టర్ పి.ఉమామహేశ్వరి దేవి, డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రసాదరాజు

క్రైం కార్నర్..

దాడి ఘటనపై కేసు

రాయవరం: వెదురుపాక గ్రామానికి చెందిన సత్తి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 22న రాత్రి ఏడు గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెంపటాపు సత్యనారాయణ అనే వ్యక్తి తన చెట్టు కొమ్మలను నరికి వేస్తుండడంతో వెంకటరెడ్డి అడిగాడు. అదే సమయంలో సత్యనారాయణ కుటుంబ సభ్యులు, ఆదాపురెడ్డి శ్రీనివాసరావులు వచ్చి దాడి చేశారు. వెంకటరెడ్డి, అతని కుమారుడిపై దాడి చేయగా, వారు చికిత్స నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెల్లూరులో ఈ నెల 5న జరిగిన ప్రమాదంలో గాయపడిన కొండ సరాబంధు (41) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. రామచంద్రపురానికి చెందిన సరాబంధు చెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. చెల్లూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద మహేంద్ర బొలేరో వాహన డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి సరాబంధును ఢీకొట్టాడు. బలమైన రక్తపు గాయాలతో కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అతను చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు.

గుర్తు తెలియని మరొకరు..

మండపేట: మండపేట– రామచంద్రపురం కెనాల్ రోడ్డులో అర్తమూరు తూము వద్ద పంట బోదెలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. మృతునికి 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉంటుంది. అతను చనిపోయి రెండు, మూడు రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మోకాలు లోతు నీటిలో మృతదేహం ఉండటాన్ని బట్టి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడా? లేక ఎవరైనా హత్యచేసి ఇక్కడ పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.